వెంకట్రావ్‌పల్లి వద్ద క్షతగాత్రులను 108లో తరలిస్తున్న స్థానికులు

శుభకార్యానికి వెళ్లి వస్తూ..

- వెంకట్రావ్‌పల్లిలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే మహిళ మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- దవాఖానకు తరలింపు

తిమ్మాపూర్/బోయినపల్లి, డిసెంబర్ 26: శుభ కార్యానికి వెళ్లి వస్తూ బోయినపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బోయినపల్లి ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామానికి చెందిన పోలవేని గట్టుబాబు, మంగ(50) దంపతులు. అయ్యప్ప దీక్షా పరుడైన గట్టుబాబు, గురువారం వేములవాడలో తన బంధువు నూతన ఇల్లు గడప పెట్టుకునే కార్యక్రమానికి తన భార్యతోపాటు చెల్లెలుబావ మాశేట్టి అహల్య-అశోక్‌తో కలిసి ఒకే కారులో వేకువజామునే వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని తిరుగు పయనమయ్యారు. మార్గం మధ్యలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి వద్ద రోడ్డు పక్కన హోటల్ ముందు నిలిపి ఉంచిన లారీ (ఎపీ 01డబ్ల్యూ 0437)ని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ముందు సీట్లో కూర్చున్న మంగ అక్కడికక్కడే మృతిచెందింది. గట్టుబాబు, అశోక్, అహల్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకే ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. క్షత గాత్రులను చికిత్స కోసం 108లో కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు. అయితే ప్రమాద దాటికి కారు నుజ్జు నుజ్జు కాగా, స్థానికులు, పోలీసులు కారును అద్దాలు పగుల గొట్టి క్షతగాత్రులను బయటకు తీశారు.

కూలీలకు పనిదినాల కల్పన కష్టమే

- ఉపాధి పనిలో పూడికతీతకు మంగళం
- ఫీల్డ్, ఫీడర్ ఛానల్స్, మట్టిరోడ్లే దిక్కు, పండ్లతోటలు, ఫాంపాండ్లకు ఓకే
- వచ్చే ఆర్థికం నుంచి అమలుకు చర్యలు
- మండలాల నుంచి జిల్లాకు చేరిన ప్రణాళిక జాబితాలు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కలెక్టరేట్, డిసెంబర్ 26 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పూడిక తీత పనులకు కేంద్రం మంగళం పాడింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి చెరువులు, కుంటల్లో పూడిక పనులు చేపట్టొద్దంటూ గ్రామీణాభివృద్ధి శాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీకాగా, దీనిని మినహాయించి మిగతా పనులపై ప్రణాళికలు సిద్ధం చేశారు. కూలీలకు అధిక పనిదినాలు కల్పిస్తున్న పూడికతీతను ఎత్తేయడంతో, పనిదినాలు కల్పించడంపై తీవ్ర ప్రభావం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధిహామీ పథక నిబంధనల మేరకు గ్రామాల్లో కూలీలకు పని కల్పించేందుకు 256 పనులు గుర్తించే వీలుండగా, వీటి నుంచి ఏటేటా ఒక్కో పనిని తొలగిస్తుండడంతో భవిష్యత్‌లో కూలీలకు కామధేనువైన ఉపాధి హామీ పథకం అందని ద్రాక్షలా మారే అవకాశాలుంటాయని అధికారులే పేర్కొంటున్నారు. గతంలో పనులు జరిగిన చెరువుల్లో తిరిగి మూడేళ్లదాకా ఎలాంటి పనులు చేపట్టొద్దంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో, గ్రామాల్లో కేవలం ఫీల్డ్, ఫీడర్ ఛానల్స్, మట్టిరోడ్ల పనులు, పండ్లతోటల పెంపకం కోసం గుంతలు తీయడం, ఫాంపాండ్ల తవ్వకంతో పాటు ఎస్సారెస్పీ కాల్వల్లో జంగిల్ క్లియరెన్స్, డిసిల్టింగ్ పనులు మాత్రమే గుర్తించినట్లు తెలుస్తోంది. కెనాల్స్‌లో భారీగా పూడిక పేరుకుపోగా, ఈపనులు చేపట్టాలా వద్దా అనే సంశయంలో అధికారులున్నట్లు సమాచారం. వేసవిలో చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతుండగా అటు కూలీలకు నిత్యం పనిదినాల కల్పనతో పాటు ఆ పూడిక రైతుల పొలాల్లోకి సేంద్రియ ఎరువుగా వినియోగమయ్యేది. అయితే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకున్న నిర్ణయం ఇటు రైతులకు, అటు కూలీలకు శాపంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఉపాధి పనుల కల్పనలో అత్యంత కీలకమైన పూడికతీత పనిని తొలగించడంతో, వారికి వందరోజుల పనిదినాల కల్పన గగనకుసుమమే అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మిగతా పనులతో కూలీలకు సరిపడా పనిదినాల కల్పన సాధ్యంకాదని అధికారులే స్పష్టం చేస్తున్నారు. ఫీడర్ ఛానల్స్, ఫాంపాండ్స్, చేపల చెరువుల తవ్వకంతో కూలీలకు అంతంత మాత్రంగానే పని లభించనుంది. వీటి తవ్వకానికి కూడా సవాలక్ష అంక్షలు విధించడంతో రైతులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఒక్కో ఫాంపాండ్ నిర్మాణానికి 12 మీటర్లకు తక్కువ కాకుండా భూమి వినియోగించాలని సూచిస్తుండగా, దాదాపు నాలుగైదు గుంటల భూమి వదలాల్సి వస్తోంది. అయితే, జిల్లాలో అత్యధిక మంది రైతులు చిన్న కమతాలే కలిగి ఉండడంతో అంత భూమి వదులుకునేందుకు సిద్ధంగా లేకపోగా, ఫాంపాండ్లు, చేపల చెరువుల తవ్వకం పనులపై ఆసక్తి కనబర్చడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా కూలీలకు ఉపాధి కల్పించేందుకు వీలుగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి కోరారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి బీసీఏవైఎఫ్ శ్రమిస్తోంది

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంజయ్‌కుమార్

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 26 : పేద విద్యార్థుల కోసం బీసీఎవైఎఫ్ శ్రమిస్తుందని బీజీ అజాద్ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మెగా ఉచిత కోచింగ్ సెంటర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, బీసీ విద్యార్థుల అభివృద్ధి కోసం మహాత్మా జ్యోతిబాపూలే స్ఫూర్తిగా ఈ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జనవరి 20 తారీకు నుంచి ఈ కోచింగ్ సెంటర్ ప్రారంభమవుతుందని దరఖాస్తుల కోసం బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు, కన్వీనర్లు కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారని ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న పేద బీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివరాల కోసం ఫోన్ నంబర్ 9701460698, 9852374374ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కుడికల భాస్కర్, జిల్లా కన్వీనర్ చిలుకమరి శ్రీనివాస్, నాయకులు సంపత్ ముదిరాజు, బీసీ రాజ్యాధికార సమితి ఉత్తర తెలంగాణ కో ఆర్డినేటర్ బుర్ర కుమార్ గౌడ్, వేముల రమేశ్, చిర్ర సంపత్ కుమార్, సదానందం ఉన్నారు.

‘డ్రింకర్ సాయి’ సినిమా పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో డ్రింకర్ సాయి చిత్రం పోస్టర్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రింకర్ సాయి చిత్రాన్ని నిర్మాతలు అద్భుతంగా తెరకెక్కించారని ఇది ఒక సందేశాత్మక చిత్రమని చెప్పారు. ఈ సందర్భంగా చిత్రాన్ని నిర్మించిన బసవరాజు శ్రీనివాస్, లహరిధర్, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. శివానీసతీశ్, న్యాయవాది సాయిరాం, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు పామరాజు విజయ్ కుమార్, ఎర్రం శెట్టి మునీందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

ఒకరిపై కేసు

చొప్పదండి, డిసెంబర్ 26 : పోలీసులపై దాడి చేసి, పోలీసు వాహనం అద్దం పగలగొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. ఎస్ఐ తెలిసిన వివరాల ప్రకారం.. చొప్పదండి పట్టణంలోని జీఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన శుభ కార్యానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఫంక్షన్‌హాల్ వద్ద ఓ వ్యక్తి తాగి గలాట చేస్తున్నాడని, ఎస్ఐకి సమాచారం రాగా, ఎస్సై సిబ్బంది కలిసి వారి ఇన్నోవా వెహికల్‌లో ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లారు. మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మండల శ్రీనివాస్ అనే వ్యక్తి తాగి గొడవ చేస్తుండగా, అదుపులోకి తీసుకోవడానికి యత్నించిన పోలీసులపై దాడి చేయగా, ఎస్ఐ కుడి చేతికి గాయం కాగా, కానిస్టేబుల్ నరసింహకు దెబ్బలు తగిలాయి. అంతే కాకుండా పోలీస్ వాహనాన్ని బండరాయితో కొట్టగా, వాహనం వెనకాల అద్దం పగిలిపోయాయి. పోలీసులపై దాడి చేసి వాహనం అద్దాలు పగుల గట్టిన మండల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా సఫల ఉత్పాన ఏకాదశి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని తిరుమల నగర్‌లోని మయూరగిరి పీఠం శ్రీనిలయంలో పరమ పవిత్రమైన మార్గశిర మాసంలో బహుళపక్షంలో వచ్చే సఫల ఉత్పాన ఏకాదశి ఉత్సవాలు చాలా వైభవంగా జరిగినాయి. మయూరగిరి పీఠాధిపతులు జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు నమిలకొండ రమణాచారి స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి లక్ష్మీనారాయణ స్వామికి అభిషేకాలు అర్చనలు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం హనుమాన్ చాలీసా పారాయణాలు పలు ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు వైభవంగా నిర్వహించారు.రామకృష్ణమాచార్యులు వినయ్ స్వామి రమేశ్ స్వామి మొదలగు పండితులు భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు ప్రదీప్‌కుమార్

డాక్టర్ ప్రదీప్ కుమార్‌కు సన్మానం

విద్యానగర్, డిసెంబర్ 26 : ఆసియా టుడే ఇండియా వారి ఫ్రైడ్ ఆఫ్ ద నేషన్ అవార్డు అందుకున్న కరీంనగర్‌లోని శ్రీసాయి లైఫ్‌లైన్ దవాఖాన చైర్మన్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్‌కుమార్‌ను గురువారం కరీంనగర్‌లోని శ్రీవాసవీ వృద్ధాశ్రమం అధ్యక్షుడు సీహెచ్ కొండయ్య, ఆశ్రమం నిర్వహణ కమిటీ బాధ్యులు తొట లక్ష్మణ్‌రావు, గంజి స్వరాజ్ బాబు, వెంకటనర్సయ్య, నారాయణ ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆశ్రమంలోని వృద్ధులకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ లైన్ దవాఖాన వైద్యులు శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ అసోసియేషన్ కార్యవర్గం

విద్యానగర్, డిసెంబర్ 26 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వామోదిత చిట్‌ఫండ్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం స్థానిక శ్రీనిధి చిట్స్ సమావేశ మందిరంలో జరిగింది. దీనిలో రాబోయే రెండేళ్లకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రొంటాల రాజిరెడ్డి, అధ్యక్షుడిగా పెంట శ్రీనివాస్, ముక్యకార్యదర్శిగా చీటీ సత్యనారాయణ రావు, కోశాధికారిగా అల్లంకి రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నామా రామ్మోహన్‌రావు, చెరుకు మహేశ్, నాంపల్లి శ్రీనివాస్, ఆడెపు మురళి, సంయుక్త కార్యదర్శులుగా రొంటాల రాంరెడ్డి, పెద్ది హరీశ్, దార అశోక్, ఏ తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనంతుల చంద్రకాంత్, సాంస్కృతిక కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్, ముఖ్య సలహాదారుగా కొండా వేణు మూర్తి, సలహాదారులుగా బోయినపల్లి నర్సింగ్ రావు, గుజ్జుల అనంతరెడ్డి, గొట్టిముక్కల కోమల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించారు.

విద్యుత్ అంతరాయం

ముకరంపుర, డిసెంబర్ 26 : నగరంలోని పలు చోట్ల డీటీఆర్ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-1, 2 ఏడీఈలు పీ శ్రీనివాస్ గౌడ్, ఎం లావణ్య వేర్వేరు ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు శివనగర్, టెలిఫోన్ క్వార్టర్స్, సప్తగిరి కాలనీ, బతుకమ్మ కుంట, బైపాస్ ప్రాంతాలకు మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు అంబేద్కర్ నగర్, శివాజీనగర్, కిసాన్‌నగర్, ఎస్టీకాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 26 : కంట్రోల్ స్విచ్, స్తంభాల షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుండు హనుమాన్ టెంపుల్ ప్రాంతం, రెడ్డి ఫంక్షన్ హాల్, తేజ స్కూల్, వావిలాలపల్లె ఏరియాలకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంగారు స్వామి హాస్పిటల్ ఏరియాకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాత పింఛన్ విధానం అమలుకు పోరాడాలి

కలెక్టరేట్, డిసెంబర్ 26 : ఉద్యోగులకు ఉరితాడుగా మారిన కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం ఎత్తేసి, పాత పింఛన్ విధానం అమలు చేసేందుకు ఉద్యోగులంతా ఏకమై పోరాటం కొనసాగించాలని, ఓపీఎస్ అమలు పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే కోటేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని మంకమ్మతోటలోని ఆ సంఘ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఓపీఎస్ అమలు చేస్తున్న దృష్ట్యా, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణ రాష్ట్రంలో కూడా పునఃప్రవేశపెట్టాలని కోరారు. పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉద్యోగులు హరిచందన్, వై వెంకటేశ్వర్‌రావు, సంతోష్‌రావు, నాయిని రాజేందర్, బింగి రాజశేఖర్, రఘుపతిరెడ్డి, బెజ్జారపు రాజు, మనోహర్, గులాబీల రాంరెడ్డి, రామక ఆంజనేయశర్మ, రావుల సంపత్‌కుమార్, విష్ణుమూర్తి, శేషుకుమార్ పాల్గొన్నారు.

మండల రౌండ్‌టేబుల్ సమావేశం

సైదాపూర్, డిసెంబర్ 26 : మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రతినిధులు పలు తీర్మానాలు చేశారు. మండల కమిటీని ఏర్పాటు చేయాలని, వర్గీకరణ ఉద్యమంలో మాదిగ యువతీ యువకులు, విద్యావంతులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. త్వరలోనే మండలంలో మండలస్థాయి బహిరంగసభను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఇటీవల నూతనంగా ఉద్యోగం చేరిన వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకట్రాజం, నాయకులు బత్తుల లక్ష్మీనారాయణ, బత్తుల కొంరయ్య, నమిండ్ల రవీందర్,మిట్టపల్లి కిష్టయ్య, ఎల్కపల్లి రవీందర్, అందె వెంకటేశ్వరరావు, గాదెపాక అశోక్, చంద్రమౌళి, వెంకట స్వామి, తిరుపతి, రవి, భువనచంద్ర, లింగమూర్తి, అరుణ్‌కుమార్, స్వామి ఉన్నారు.

వైరాగ్యం ప్రభాకర్‌కు ఆహ్వానం..

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 26 : డిసెంబర్ 28, 29 తేదీల్లో విజయవాడ కొత్తపేటలోని కేబీఎస్ కళాశాల అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాంగణంలో జరుగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొనడానికి ఆహ్వానం అందినట్లు భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ తెలిపారు. కవి సమ్మేళనంతో పాటు లోకనాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో జరుగు సాహితీ ప్రతినిధుల సభలో పాల్గొంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కరీంనగర్ లోని పలువురు కవులు రచయితలు ప్రభాకర్‌ను అభినందించారు.

30 నుంచి క్రీడా పోటీలు

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 26 : పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఈ నెల 30, 31న నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో యువ శక్తి యూత్ అసోసియేషన్ వారు వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షెటిల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని యువశక్తి అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.4 వేల విలువ గల క్రీడా సామగ్రిని, అదే విధంగా ద్వితీయ స్థాయి వారికి ట్రోఫీలు ఇవ్వబడునని, మెడల్స్, సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. అసక్తి గల వారు ఫోన్ నంబర్ 9989348072ను సంప్రదించాలన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమితి సభ్యురాలిగా కిరణ్మయి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 26 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలు 23, 24, 25 తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించగా, 2024-25కు సంబంధించిన ఏబీవీపీ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి గురువారం ప్రకటించారు. ఈ నూతన కార్యవర్గంలో శాతావాహన యూనివర్సిటీలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న గంట కిరణ్మయిని రాష్ట్ర కర్యవర్గ సమితి సభ్యురాలిగా నియమించారు. కిరణ్మయి గతంలో జోనల్ జోనల్ ఇన్‌చార్జిగా, నగర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు.

ఉపాధిహామీ అడిట్ గ్రామ సభలు..

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 26: మండలంలోని పంచాయతీలో ఉపాధిహామీ సోషల్ అడిట్ గ్రామసభల షెడ్యూల్‌ను ఎంపీడీవో సంజీవరావు వివరించారు. మండల పరిధిలోని గ్రామాలు ఉపాధిహామీ సోషల్ అడిట్ గ్రామ సభలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గురువారం చేగుర్తి, ఉదయం 10 గంటలకు. పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. సభలో గ్రామంలో 2023-24వ వార్షిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పనులపై సభలో చర్చించారు. గ్రామ ప్రత్యేకాధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

చిగురుమామిడి, డిసెంబర్ 26 : మండలంలోని ఇందుర్తిలో మాజీ సర్పంచ్ పులి వీరవ్వ(70) గుండెపోటుతో గురువారం మృతి చెందింది. ఆమె గ్రామంలో ఐదేళ్లు సర్పంచ్‌గా కొనసాగింది. గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల హృదయాల్లో గుర్తింపు పొందింది. కాగా, ఆమె మృతిపై మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర మాజీ హౌసింగ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ సర్పంచ్ అందే స్వరూప సంతాపం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ కోటెడ్ ప్లేట్స్ వద్దు .. స్టీల్ ప్లేట్లు ముద్దు

ప్లాస్టిక్ నిషేధించాలని స్టీల్ ప్లేట్లను చూపిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

విద్యానగర్, డిసెంబర్ 26 : కరీంనగర్ జిల్లా ప్రధాన దవాఖానలో ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుంది. అల్పాహారం, అన్నప్రసాద వితరణ చూసిన ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్, ఆర్ఎం కోరిక మేరకు ఈరోజు బొమ్మకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వెంగల్ దాస్ అర్చన-శ్రీనివాస్, పెళ్లి రోజు సందర్భంగా రూ. 5000 విలువ గల 100 స్టీల్ ప్లేట్స్ మీల్స్ ఆన్ వీల్స్ నిర్వాహకులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్ చింతల కిషన్ పటేల్, క్లబ్ అధ్యక్షుడు కాంరెడ్డి నరసింహారెడ్డి, సెక్రటరీ బట్టు రాజేందర్, మాసినేని చక్రధర్, రవి కంటి కృష్ణ కిశోర్, అరికొంతం రవీందర్ రెడ్డి, జీవీ లక్ష్మీనారాయణ, మల్లికార్జున రాజేందర్, బూర్ల విద్యాసాగర్, అంబాటి రవీందర్ రాజు, ఇంజినీర్ కోల అన్నారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాసానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, డిసెంబర్ 26 : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం మండలంలోని బూరుగుపల్లిలోని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నివాసానికి వెళ్లారు. రామడుగు మండలం షానగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు వెళ్తున్న క్రమం లో బూరుగుపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, మండల బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు గడ్డం స్వామి, గడ్డం నర్సయ్య, దుర్గయ్య ఉన్నారు.

రాష్ట్ర స్థాయిలో సీఎం కప్‌ను కైవసం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్ : క్రీడాదుస్తులతో విద్యార్థులు

ఆర్డీవో మహేశ్వర్

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 26 : రాష్ట్ర స్థాయిలో సీఎం కప్‌ను మనమే కైవసం చేసుకోవాలని ఆర్డీవో మహేశ్వర్ విద్యార్థులకు స్ఫూర్తి నిచ్చారు. గురువారం మండలం నుంచి సీఎం కప్ పోటీల్లో 40 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారు. కాగా, వారికి క్రీడలపై స్ఫూర్తిని పెంపొందించేందుకు సుమార్ రూ. 31 వేల విలువ గల క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్‌ను మనమే సాధించుకోవాలన్నారు. మండలం నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్‌నకు విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్ రెడ్డి, సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు తిరుపతిరావు, 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

గంగాధర, డిసెంబర్ 26 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు కోటేశ్, ప్రణయ్ సీఎం కప్ ఆత్యా-పాత్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారని ఫిజికల్ డైరెక్టర్ బాబు శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కాగా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులురాలు అనితాకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం కప్‌కు హుజూరాబాద్ హాకీ క్రీడాకారుల ఎంపిక

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 26 : సీఎం కప్ 2024 హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరుగు హాకీ టోర్నమెంట్‌కు కరీంనగర్ టీం తరుపున హుజూరాబాద్ హాకీ క్లబ్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో పల్లపు సాంబరాజు, మోతపోతుల వినయ్, మోతపోతుల వినిత్, మోతపోతుల విపుల్, మ్యాదరబోయిన పవన్, ఆదిత్య, సాయి మణి, పోలు రాజ్ కుమార్, సారబుద్ల సాయి, మిథున్ రెడ్డిలు ఎంపికయ్యారు. వారి ఎంపికపై హుజూరాబాద్ హాకీ క్లబ్ శాశ్వత అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, కరీంనగర్ జిల్లా హాకీ క్లబ్ ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఉమామహేశ్వర్, ఉపాధ్యాక్షుడు భూసారపు శంకర్, సీనియర్ క్రీడాకారులు సమ్మయ్య, హుజూరాబాద్ హాకీ కోచ్ తిరునహరి శ్రీనివాస్, బండ రఘు, కే భిక్షపతి, శ్యాంకుమార్, రమేశ్, తిరుపతి, రాజేశ్, సాయి కృష్ణ, విక్రం అభినందించారు.

కొత్తపల్లి, డిసెంబర్ 26 : వరంగల్‌లో ఈనెల 27 నుంచి 29 వ